
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 । కనిష్ఠం : 19.0
ANDHRAJYOTHY
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025



ఉత్సవాలకు ముస్తాబుచేసిన తిక్క వీరేశ్వరస్వామి ఆలయం

ఆ గ్రామంలో.. 66 ఓట్లే

- మొత్తం 8 వార్డులు, ఎనిమిది ఓట్లకు ఒక వార్డు చొప్పున కేటాయింపు
- 2020లో పంచాయతీ ఏర్పాటు, తర్వాత అనుబంధ గ్రామం పురపాలికలోకి..
- సాంకేతిక తప్పు కారణంగా మ్యాపింగ్ చేయకపోవడంతో సమస్య
- ఈసారి ఆ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారుల కసరత్తు
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరాయిపల్లి తండా పరిస్థితి ఇదీ


శంకరాయిపల్లి గ్రామం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాధారణంగా ఒక గ్రామ పంచాయతీ అంటే కనీసం వెయ్యి మంది జనాభా, 700 వరకు ఓట్లు, పంచాయతీ భవనం, వార్డులు, సర్పంచులు ఇలా ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలు, చిన్నచిన్న గ్రామాలను కూడా పంచాయతీలు చేశారు. కనీసం 500 జనాభా ఉండి 300 వరకు ఓట్లు ఉన్నా చాలా వరకు గ్రామాలను పంచాయతీలుగా మార్చారు. తర్వాత ఎన్నికలొచ్చాయి. సర్పంచులూ గెలిచారు. తండాల్లో కూడా స్వయంపాలన ఫలాలు అందుతున్నాయి. అయితే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరాయిపల్లి తండా కూడా ఇలాగే పంచాయతీగా ఏర్పడింది. అయితే తండాలను పంచాయతీలు ఏర్పాటు చేసిన సమయంలో కాకుండా 2020 డిసెంబరులో దీన్ని పంచాయతీగా ఏర్పాటు చేశారు. శంకరాయిపల్లి, శంకరాయిపల్లి తండా కలిపి దాదాపు 300 పైచిలుకు జనాభా ఉండగా తండాలో 192 ఓట్లు, శంకరాయిపల్లిలో 66 ఓట్లు ఉండేవి. ఆ తర్వాత 2021లో జడ్చర్ల మునిసిపాలిటీకి ఎన్నికలు జరిగినప్పుడు అందులో శంకరాయిపల్లి తండా పురపాలికలో విలీనమైంది. మిగతా శంకరాయిపల్లి మాత్రం

(మిగతా 6లో..)

ప్రత్యేక పంచాయతీగా కొనసాగించాలి



మా తండా, మా రాజ్యం పేరుతో సాధించుకున్న తండా పంచాయతీలను అలాగే కొనసాగించాలి. 2020లో పంచాయతీగా ఏర్పాటు చేసి టెక్నికల్ సమస్య పేరుతో మునిసిపాలిటీలో విలీనం చేశారు. మునిసిపల్ పరిధిలో ఉన్న గ్రామాన్ని కూడా మళ్లీ పంచాయతీలో విలీనం చేసి నిధులు, ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులకు విధులు ఉండేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

- కిషన్ నాయక్, శంకరాయిపల్లి తండా

గోవిందా.. గోవింద

- వైభవంగా మన్యంకొండ వెంకన్న రథోత్సవం
- స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

6

రేపటి నుంచి తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అయిజ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 15వ తేదీన స్వామి వారి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 16వ తేదీ ఆదివారం శాంతి హోమము, రాత్రి 8-45 నిమిషాలకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు. 17వ తేదీ సోమవారం రాత్రి 10-05 నిమిషాలకు రథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. 18వ తేదీ సాయంత్రం కోలాటాల ప్రదర్శన, 20వ తేది నుంచి 24వ తేది వరకు ప్రతీ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, 19వ తేదీన సందరాళ్లు, దొబ్బుడు గుండ్లు ఎత్తుపోటీలు నిర్వహించనున్నారు. 20వ తేదీన జాతీయ స్థాయి కుస్తీ పోటీలు, 21వ తేది జాతీయ స్థాయి పొట్టేళ్ల బల ప్రదర్శన, 22వ తేదీన పాల పళ్ల విభాగంలోను, 23వ తేదీన సేద్యపు టెద్దుల విభాగం, 24న సీనియర్స్ విభాగంలో పశుబల ప్రదర్శన పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


తిక్క వీరేశ్వరస్వామి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాందాపూర్ గ్రామ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలే పట్టణాలకు పట్టుగొమ్మలు, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లకు, గ్రంథాలయ భవన, బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ.. గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.3.60 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. రూ.2.80 కోట్లతో మహమ్మదాపూర్ నుంచి కంబాలాపూర్ ఎక్స్ రోడ్డు వరకు బీటీ రోడ్డు, రూ.10 లక్షలతో మాందాపూర్‌లో గ్రంథాలయ భవన నిర్మాణం, రూ.15.50లక్షలతో వీరన్నచెరువు నుంచి తాగునీటి పనులకు భూమిపూజ చేశామన్నారు. అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మధుసూదన్, రవి, వెంకటేశ్ నాయుడు, తిరుపతి, రాము, శేఖర్, బాలరాజు, రాజు పాల్గొన్నారు.

యాచకురాలిపై అత్యాచారం, హత్య?

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెనుక భాగంలో గల ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ గేటు దగ్గర ఓ యాచకురాలిపై అత్యాచారం చేసి హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 45 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ తనకు ఎవరూ కూడా తోడు లేకపోవడంతో అనాథగా జీవనం సాగిస్తోంది. పట్టణంలోని ఓ ప్రధాన ఆసుపత్రిలో పెట్టే ఉచిత భోజనం తిని ఆసుపత్రి పరిసరాల్లోనే తిరుగుతూ కాలం గడిపేది. గురువారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రి వెనుక మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్ఐ గోవర్ధన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అత్యాచారం, హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో వచ్చిన అంశాలు జిల్లా ఆసుపత్రి చుట్టూ ఉండే సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో సురేశ్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఇ ద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన వెలుగులోకి వచ్చింది. గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చందన, వైష్ణవిలు బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే హాస్టల్ సిబ్బంది వారిని తెలకపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం హాస్టల్‌కు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా శ్వాసకోశమైన ఇబ్బందులతో వారు ఆసుపత్రిలో చేరారని అధికారులు చెబుతున్న మాటలకు వాస్తవ పరిస్థితికి పొంతన లేదని తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని స్వేరోస్‌తో సహా వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అనారోగ్యం పాలైన విద్యార్థినుల్లో ఒకరి పరిస్థితి కొంచెం ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్ గురువారం ఆ విద్యార్థులను పరామర్శించారు.

భూ పరిహారం అక్రమార్కుల ఖాతాల్లోకి

- వీటిపై అధికారులు పునర్విచారణ జరిపించాలి
- స్వార్థంతోనే సర్వేను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

6



మనసున మనసై..

- నేడు ప్రేమికుల దినోత్సవం
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

ప్రేమ.. రెండక్షరాల ఈ పదం రెండు మనసులను కలుపుతోంది. కులం, మతం వంటి అడ్డుగోడల కంచెను తెంచి ఒక్కటి చేస్తోంది. నమ్ముకుని వచ్చిన యువతికి అన్నీ తానై ఉండాలని, తమ కాళ్లపై తాము నిలబడ్డప్పుడు ప్రేమకు ఇబ్బందులు ఉండవని అంటున్నారు పలువురు ప్రేమ వివాహం చేసుకున్న దంపతులు. ఒకరి నొకరు అర్థం చేసుకొని, గౌరవించుకుంటే కుటుంబంలో గొడవలు రావని చెబుతున్నారు. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం మీ కోసం..

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

7

ఇసుక కోసం దళారులను ఆశ్రయించొద్దు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక అవసరం ఉన్నవారు 'మన ఇసుక వాహనం' ద్వారానే తీసుకోవాలని, దళారులను ఆశ్రయించవద్దని కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు ఏమైనా సమస్యలు తలెత్తితే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని అన్నారు. వనపర్తి జిల్లా ప్రజల అవసరం మేరకు మన ఇసుక వాహనం ద్వారా ఇంటి వద్దకే ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 08545-233525 ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, గృహ నిర్మాణాలు చేపడుతున్న ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుక సరఫరా చేస్తున్నామని తెలిపారు.

అలంపూరులో దొంగల హల్‌చల్

- రెండు ఇళ్లలో వరుస చోరీలు
- హార్డ్ డిస్క్‌తో సహా నగలు, నగదు గాయబ్
- ఉండవల్లిలో ఆలయ తాళాలు ధ్వంసం

6

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలో సైబర్ నేరాలపై స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల స్వర్ణకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తు వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రోజు వారిగా వాడే మొబైల్స్, ల్యాప్‌టాప్‌ల ద్వారా మన డేటాని హ్యాక్ చేసి పలు రకాల ఇబ్బందులకు గురి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, స్వర్ణకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్


వనపర్తి జిల్లా గోపాల్‌పేట గ్రామ శివారులోని చెక్‌డ్యాంలో సేద తీరుతున్న బర్రెలు

ఎండల్లో హాయ్.. హాయ్

వనపర్తి జిల్లా బుద్ధారం శివారులో గల రామచంద్ర చెక్ డ్యాం వేసవి మొదలవుతున్న ఈ సమయంలోనూ నిండుకుండలా తొణికిసలాడుతోంది. అలుగు పారుతూ కనువిందు చేస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగిస్తోంది. ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇది పిక్నిక్, ఫొటో షూట్ స్పాట్‌గా మారింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

మహిళపై దాడి చేసి యువకుడి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు మహిళపై దాడి చేసి ఆ తరువాత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఓఆర్ఆర్ పక్కనున్న డీటీడీసీ కొరియర్ వెనకాల ఉన్న రాజీవ్ గృహకల్పలో నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్త పల్లికి చెందిన వరలక్ష్మి (25) నివాసం ఉంటోంది. కొన్ని రోజుల క్రితం వరలక్ష్మి భర్త మృతి చెందాడు. ఏపీ కదిరికి చెందిన మన్సూర్ (23) మహిళ ఇంటి పక్క ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్ప డింది. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో వరలక్ష్మి తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. గురువారం రూం ఖాళీ చేద్దామని రూమ్‌కి వచ్చిన ఆమెతో మన్సూర్ గొడవపడి బండరాయితో ఆమె తలపై బలంగా కొట్టాడు. రక్తపు మడుగులో ఉన్న వరలక్ష్మి మృతి చెందింద ని నిర్ధారించుకున్నాడు. ఆ తరువాత తన రూమ్‌లోకి వెళ్లి మన్సూర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన వరలక్ష్మి తండ్రి తన కూతురుని పోలీసుల సహాయంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మన్సూర్ మృత దేహన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వరలక్ష్మికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.



రథోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు





రథంపై స్వామి వారు, స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

గోవిందా.. గోవింద

- వైభవంగా మన్యంకొండ వెంకన్న రథోత్సవం
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



స్వామికి మొక్కుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గోవిందా నామస్మరణతో మన్యంకొండ మార్మోగింది. బుధవారం అర్ధ రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి ముఖ్య అతిథిలుగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. అంతకు ముందు మన్యంకొండ ఆలయ అర్చకులు, చైర్మన్ అలహరి మధుసూదన్‌కుమార్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వామి వారిని గర్భగుడి నుంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగగా, దారి పొడవునా భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి, మొ క్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, రెవెన్యూ, మునిసిపల్, పోలీస్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ ఆలయ ఈవో శ్రీనివాసరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, నాయకుడు ధర్మాపూర్ నర్సింహరెడ్డి పాల్గొన్నారు. గురువారం ఆలయ స్వామి వారిని అలంకరించి, అభిషేకాలు చేసి గరుడవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అశ్వావాహన సేవా, ద్వితీయ ప్రభోత్సవం నిర్వహించారు.

ఆ గ్రామంలో 66 ఓట్లే..

(5వ పేజీ తరువాయి)

ఇంకా పంచాయతీగానే ఉన్నది. అయితే దానికి ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. ఈసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఏదైనా గ్రామం మునిసిపాలిటీలో విలీనం చేయాలన్నప్పుడు పూర్తి పంచాయతీని విలీనం చేస్తారు. కానీ, పంచాయతీ ఏర్పాటు సమయంలో గ్రామ పరిధి, మ్యాపింగ్ సరిగా చేయకపోవడం వల్ల అనుబంధ గ్రామం జడ్చర్ల మునిసిపాలిటీలో విలీనం కాగా కేవలం 66 ఓట్లతో శంకరాయిపల్లి పంచాయతీగా కొనసాగుతోంది.

ఒక్కో వార్డుకు ఎనిమిది ఓట్లు

శంకరాయిపల్లి, తండా గ్రామాలు ఒకప్పుడు జడ్చర్ల మేజర్ పంచాయతీలో భాగంగా ఉండేవి. 2017లో అప్పటివరకు ఉన్న బాదేపల్లి మునిసిపాలిటీలో జడ్చర్ల మేజర్ పంచాయతీని విలీనం చేశారు. అప్పటికి ఇంకా పంచాయతీ పాలకవర్గం ఉండటంతో వారు కోర్టుకు వెళ్లారు. పాలకవర్గం గడువు ముగిసే వరకు పంచాయతీగానే కొనసాగించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. 2020 డిసెంబరు 15కు పాలకవర్గం గడువు ముగిసి మునిసిపాలిటీలో విలీనం అయ్యింది. బాదేపల్లి పేరును మార్చి జడ్చర్ల మునిసిపాలిటీని చేశారు. మేజర్ పంచాయతీలో అప్పటివరకు భాగంగా ఉన్న శంకరాయిపల్లి, తండాను ఒక పంచాయతీగా, బండమీదిపల్లిని ఒక పంచాయతీగా గుర్తించారు. అయితే గ్రామ పరిధి, మ్యాపింగ్‌ను ఆ సమయంలో సరిగా చేయలేదు. పంచాయతీ ఎన్నికలు కూడా లేకపోవడంతో అవి ప్రత్యేక అధికారుల పాలనలోనే నేటికీ ఉన్నాయి. 2021లో జడ్చర్ల మునిసిపాలిటీకి ఎన్నికలు జరుగగా ఆ సమయంలో మునిసిపాలిటీలోని 9వ వార్డులో శంకరాయిపల్లి తండాను విలీనం చేశారు. శంకరాయిపల్లిని మాత్రం అలాగే ఉంచారు. తండాలో ఉన్న 192 ఓట్లు మునిసిపాలిటీలోకి రాగా.. శంకరాయిపల్లిలో మాత్రం 66 ఓట్లు మిగిలిపోయాయి. ఇప్పుడు ఆ గ్రామానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండటంతో వార్డుల వారీగా ఓట్లను విభజించారు. రెండు, తొమ్మిదో వార్డుల్లో 9 మంది చొప్పున ఓటర్లు ఉండగా, మిగతా అన్ని వార్డుల్లో 8 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు.

నిధుల గండం

పంచాయతీలకు మూడు విధాలుగా నిధులు ప్రస్తుతం అందుతున్నాయి. మొదట పంచాయతీ పరిధిలో వసూలు చేసే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, రెండోది 15వ ఆర్థిక సంఘం, మూడోది స్టేట్ ఫైనాన్స్ ద్వారా నిధులు అందుతున్నాయి. జనాభా ఆధారంగా నిధుల కేటాయింపు ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 15 శాతం నిధులు, గ్రామ విస్తీర్ణం ప్రకారం 15 శాతం నిధులు, పనితీరు ఆధారంగా 12.5 శాతం నిధులు, గ్రీనరీకి సంబంధించి 10 శాతం నిధులు, ట్యాక్స్ వసూళ్లకు సంబంధించి 2.5 శాతం నిధులు వస్తున్నాయి. కానీ, ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం శంకరాయిపల్లిలో జనాభా 83 మాత్రమే. విస్తీర్ణం పరంగానూ చిన్నదే. ఇప్పుడా గ్రామంలో పంచాయతీ కార్యక్రమాలు కూడా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. తక్కువ జనాభా ఉండటం వల్ల నిధులు కూడా తక్కువగా వస్తాయనే ఆందోళన ఉన్నది. జడ్చర్ల మునిసిపాలిటీలో విలీనం చేసిన తండాను కూడా తిరిగి పంచాయతీలో కలిపి నిధులు కూడా ఎక్కువ వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. తమను మునిసిపాలిటీలో కలపొద్దని కూడా కోరుతున్నారు.

భూ పరిహారం అక్రమార్కుల ఖాతాల్లోకి



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో మాట్లాడుతున్న ఉదండాపూర్ నిర్వాసితులు

- వీటిపై అధికారులు పునర్విచారణ జరిపించాలి
- స్వార్థంతోనే సర్వేను అడ్డుకుంటున్న బీఆర్ఎస్
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు భూ పరిహారం చెల్లింపులు, పునరావాసం ప్యాకేజీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. అక్రమార్కుల ఖాతాల్లోకి కోట్ల రూపాయలు మళ్లించారని ఆరోపించారు. గురువారం ఉదండాపూర్ భూ నిర్వాసితులు జడ్చర్లలో ఎమ్మెల్యేను కలిసి భూ పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూముల పరిహారంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, అధికారులు మరోసారి పునర్విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ అక్రమాలు భయటపడతాయనే బీఆర్ఎస్ నాయకులు సర్వే పనులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ స్వలాభం కోసం ప్రాజెక్ట్ పనులు అడ్డుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని, భూమి ఒకరిదైతే పరిహారం మరొకరి ఖాతాల్లోకి వెళ్లిందని, నిజమైన లబ్ధిదారులు మాత్రం ఇప్పటికీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై అసెంబ్లీలోనూ లేవనెత్తుతానని, పునరావాసం పరిహారం పెంపుకోసం కూడా ప్రయత్నం చేస్తున్నానని వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్ట్ పనులను అడ్డుకుంటే సహించేది లేదని, ఈ అక్రమాలపై అప్పటి తహసీల్దార్, ఆర్ఐల పాత్రపైనా విచారణ చేయాలన్నారు.

పునరావాసం ప్యాకేజీ చెల్లించాలి

పాలమూరు ఎత్తిపోతల పథకం, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్, వల్లూరు గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం ప్యాకేజీని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉదండాపూర్ నిర్వాసితులు ప్రాజెక్ట్ కట్టపై టెంట్లను ఏర్పాటు చేసి గురువారం దీక్షలు ప్రారంభించారు. పునరావాసం ప్యాకేజీని రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి ఇప్పించే బాధ్యత తీసుకుంటా అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన ఇచ్చిన మేరకు ప్యాకేజీని చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీని చెల్లించిన అనంతరమే పనులు చేపట్టాలని అప్పటి వరకు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పనులను అడ్డుకున్నారు. శ్రీను, శేఖర్, ఐలప్ప, హన్మంతు, జబీఉల్లా, మల్లేష్, జహంగీర్, సాయమ్మ, మంగమ్మ, చెన్నమ్మ, వెంకటమ్మ, సుక్కమ్మ ఉన్నారు.



భిక్షాటన చేస్తున్న చిన్నారులను అదుపులోకి తీసుకుంటున్న అధికారి

భిక్షాటన చేస్తున్న చిన్నారులు అదుపులోకి

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో భిక్షాటన చేస్తున్న ఆరుగురు చిన్నారులను చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా సమన్వయకర్త నర్సింహులు, రెస్క్యూ ప్రొటెక్షన్ అధికారి కరిష్మా అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు గురువారం 1098కు సమాచారం అందించడంతో అధికారులు ప్రత్యేక వాహనంలో వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. పిల్లలు భిక్షాటన చేయడం, బాల్యవివాహాలు చేయడం, పిల్లలను హింసించడం, అక్రమ రవాణా చట్టరీత్యా నేరం అని, అందుకు శిక్షకు అర్హులు అవుతారన్నారు. పిల్లలు బడికి దూరంగా సమస్యల్లో ఉంటే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు రిమాండ్

గండీడ్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులు తాళలేక వారం రోజుల క్రితం భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘనటలో భర్తపై కేసు నమోదు కాగా, గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పగిడ్యాల్ గ్రామానికి చెందిన బొమ్మరాజ్ పద్మమ్మను భర్త షైబు మానసికంగా వేధించడంతో గ్రామ శివారులో ఉన్న మల్లమ్మ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన మృతిరాలి అన్న వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు షైబును గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

- మిడ్జిల్ మండలం చేధ్‌ఘాట్‌తండాలో ఘటన

మిడ్జిల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని చేధ్‌ఘాట్‌తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. చేధ్‌ఘాట్‌తండాకు చెందిన బిందు(20) అదే తండాకు చెందిన లచ్చిరాంతో పది నెలల క్రితం వివాహం జరిగింది. తోటి కోడలైన రాజికి, బిందు మధ్య తరచు గొడవలు జరగడంతో కుటుంబ సభ్యులు సర్దిచెప్పేవారు. బుధవారం రాత్రి రాజీ బిందును కొట్టిందని, గురువారం ఉదయం రాజీతో పాటు భైరంపల్లి గ్రామానికి చెందిన యాదయ్యగౌడ్ బిందును దూషించడంతో పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి సేనావత్ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీశైలానికి తగ్గిన ఎక్స్‌ప్రెస్‌లు

- సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను నడుపుతున్న అధికారులు
- ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లు నడపాలని డిమాండ్ చేస్తున్న ప్రయాణికులు



ఎక్స్‌ప్రెస్ స్థానంలో నడుపుతున్న మహబూబ్‌నగర్ డిపో బస్సు

దోమలపెంట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. కానీ, శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లే రాష్ట్ర మహిళలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో నిత్యం వేలాది మంది భక్తులు శ్రీశైలం వెళ్తుంటారు. ఏడాది క్రితం వరకు హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వివిధ డిపోల నుంచి సూమారు 80 బస్సులు నడిపేవారు. ఇందులో 40 వరకు ఎక్స్‌ప్రెస్‌లు నడిపేవారు. వీటిలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేవారు. క్రమంగా ఈ డిపోల నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు తగ్గించి డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని (ఏసీ) సర్వీసులను మాత్రమే నడిపిస్తున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ వైపు నుంచి వివిధ డిపోలకు చెందిన 20 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపేవారు. రెగ్యులర్ బస్సుల స్థానంలో గద్వాల, మహబూబ్‌నగర్ డిపోల నుంచి డీలక్స్ సర్వీస్‌లను నడపుతున్నారు. దీంతో మల్లన్న దర్శనానికి వెళ్లే నిరుపేదలు ఉచిత ప్రయాణ సౌకర్యానికి నోచుకోలేక ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా నల్లమల ప్రాంతంలో గిరిజనులు, గిరిజనేతరులు అటవీ ఉత్పత్తులను విక్రయించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అచ్చంపేట డిపో నుంచి శ్రీశైలానికి ఆర్డినరీ బస్సులను నడపాలని నల్లమల ప్రాంత వాసులు కోరుతున్నారు.

బస్సుల కొరత ఉన్నది

ప్రస్తుతం బస్సుల కొరతతో పాటు డ్రైవర్ల కొరత కూడా ఉన్నది. ప్రభుత్వం నూతన బస్సులను కేటాయించగానే డీలక్స్ బస్సుల స్థానంలో ఎక్స్‌ప్రెస్ సర్వీస్సులను నడిపిస్తాం. పేదలకు ఇబ్బంది కలుగకుండా అన్ని రూట్లల్లో సమయానికి బస్సులు నడిపిస్తాం.

- సంతోష్ కుమార్, మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్

శ్రీశైలానికి ఆర్డినరీ బస్సులు నడుపాలి



చెంచులు అటవీ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మన్ననూర్, అచ్చంపేట ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు శ్రీశైలం- అచ్చంపేట ఆర్డినరీ బస్సులు నడుపాలి. పేదలు ఉచిత ప్రయాణం చేసే విధంగా చూడాలి.

- చిగుర్ల మల్లికార్జున్, చెంచు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెబ్బేరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాఖాపురం వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆర్‌టీవో వాసుదేవరావు తెలిపారు. గురువారం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో 10 ఇసుక ట్రాక్టర్లు పట్టుబడినట్లు ఆయన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు. అనుమతి పత్రాలను పరిశీలించగా రెండు ట్రాక్టర్లకు అనుమతులు ఉండడంతో వదిలిపెట్టి మిగితా ఎనిమిది ట్రాక్టర్లను ఆర్‌టీవో కార్యాలయానికి తరలించి ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై వాహనాలు నడిపితే.. కేసులు నమోదు చేసి, జరిమానా వేస్తామని హెచ్చరించారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ఎర్రకుంట, ఊర చెరువుకు కేఎల్ఐ నీరు

-హర్షం వ్యక్తం చేసిన ఆయకట్టు రైతులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మార్కండేయ పంప్ హౌజ్ మోటార్ల ద్వారా ఎర్రకుంట, ఊర చెరువులకు కేఎల్ఐ నీటితో నింపి ఆయకట్టు రైతులకు మేలు చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రెండు రోజుల్లోనే గురువారం నీళ్లు పారించడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాయిన్‌పల్లి సర్పంచ్ అవంతి శంకర్, పీఏసీఎస్ డైరెక్టర్ దీప్లానాయక్‌లు మాట్లాడుతూ చుట్టూ కేఎల్ఐ కాలువల నీళ్లు పారుతున్నా ఎర్రకుంట, ఊరచెరువ ఆయకట్టు రైతులకు నీళ్లు లేక తీవ్ర నష్టపోతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సంబంధిత కేఎల్ఐ ప్రాజెక్టు ఇంజనీర్లతో మాట్లాడి తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గంలో వెంటనే నీటిని విడుదల చేయాలని ఆదేశించి పనులు ప్రారంభింపజేసి స్వయంగా క్షేత్ర పరిశీలన చేశారు. యుద్ధప్రాతిపదికన అధికారులు పనులు పూర్తి చేసి నీటి పారించినందుకు శాయిన్‌పల్లి, వసురాం తండా, గంగారం గ్రామాల రైతులు, ప్రజలు శివ, కురుమయ్య, లక్ష్మీనారాయణ, సూరి, నిరంజన్, రాములు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కనుల పండువగా రథోత్సవం



దేవుని తిర్మలాపూర్‌లో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని తిర్మలాపూర్‌లో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం గురువారం తెల్లవారుజామున కనుల పండువగా సాగింది. భక్తుల గోవిందనామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సూర్యప్రతాప్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు వీ సత్యం, పీచిన్నయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

తనగలలో పోలీస్ పికెట్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తనగల గ్రామంలో బుధవారం రమేష్ మృతి చెందిన నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ టాటాబాబు తెలిపారు. గురువారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ శాంతినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్దూరు స్టేజి సమీపంలో అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనం ప్రమాదం జరగడంతో రమేష్ మృతిచెందాడు. మృతుడి మామ సుధాకర్ తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, ఆస్తి తగాదా వల్లే హత్య జరిగి ఉండొచ్చని సీఐ తెలిపారు. తనగల గ్రామంలో ఎలాంటి అవాంఛనీ యమైన సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు మధ్య రమేష్ అంత్యక్రియలు పూర్తి చేశామని సీఐ తెలిపారు.

నేటి నుంచి రాజావలి దర్గా ఉత్సవాలు

అమరచింత, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హజ్రత్ సయ్యద్ షా రాజావలి దర్గా ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉత్సవాలు గంధోత్సవంతో ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగుతాయని వారు తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని అన్నారు. కులమతాలకతీతంగా ఉత్సవాల్లో అమరచింత మండలంతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మొక్కులను చెల్లించుకుంటారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, స్వర్ణా సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొననున్నారు.

పరిశోధనల ఫలితాలు రైతులకు చేరాలి

- డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డీఈఈ



పాలెంలో వ్యవసాయ శాఖ అధికారులను, రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి

బిజినేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వివిధ పంటలపై శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలని హైదరాబాద్ రాజేందర్‌నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం డీఈఈ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం ఆర్ఏఆర్ఎస్‌లో గురువారం ఏడీఆర్ డాక్టర్ పుష్పావతి అధ్యక్షతన కేవీకే, ఏరువాక కేంద్రాలు సంయుక్తంగా నిర్వహించిన శాస్త్రీయ సలహా, సమన్వయ సంఘం సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రైతుల ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకొని సుస్థిర, సమగ్ర వ్యవసాయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు వ్యవసాయ సమాచారం అందించడంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, క్షేత్రస్థాయిలోని అన్నదాతలకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించేలా వ్యవస్థ పని చేయాలని అన్నారు. డిజిటల్ ప్లాట్ ఫామ్స్, డ్రోన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టూల్స్, టెక్ ఫామింగ్ వంటి వినూతన పద్ధతులను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సగర శంఖారావ సభను విజయవంతం చేయాలి

- సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీ మైదానంలో 16న నిర్వహించ తలపెట్టిన సగర శంఖారావ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో సగర సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సగరులు ప్రస్తుతం సగరులు అంటే రోజు వారి కూలీలుగా, తాపీ మేస్త్రీలుగా మిగిలిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సగరుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు సగరులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

అలంపూరులో దొంగల హల్‌చల్

- రెండు ఇళ్లలో వరుస చోరీలు
- హార్డ్ డిస్క్‌తో సహా నగలు, నగదు గాయబ్
- ఉండవల్లిలో ఆలయ తాళాలు ధ్వంసం
- హుండీ తాళాలు పగలకపోవడంతో తిరుగుముఖం

అలంపూరు చౌరస్తా/అలంపూరు ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అలంపూరు పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. రెండు ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అలంపూరు పట్టణంలోని ఎనిమిదో వార్డు న్యూప్లాట్స్ కాలనీలోని వినోద్, బ్యాంకు నరసింహలకు చెందిన రెండిళ్లలో చోరీ జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి రూ.20వేల నగదు, తులం బంగారు ఆభరణం తీసుకెళ్లారు. చోరీ జరిగిన ఓ ఇంట్లో సీసీ కెమెరాలు ఉండటంతో వీడియో ఫుటేజీలను, హార్డ్‌డిస్క్‌ను కూడా ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాలను అలంపూరు సీఐ రవిబాబు పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని డాగ్, క్లూస్ టీంతో పరిశీలించారు.

ఇటీవల ఎవరూ లేని ఇళ్లను ఎంపిక చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉండగా ఉండవల్లి మండలంలోని బూడిదపాడు శివారులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం గేట్లు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. హుండీ తాళాలు పగలక పోవడంతో వెనుతిరిగినట్లు పోలీసులు తెలిపారు.



అలంపూరు న్యూప్లాట్స్ కాలనీలో చోరీకి గురైన ఇల్లు



మనసున మనసై

నేడు ప్రేమికుల దినోత్సవం

రెండు అక్షరాల ప్రేమ.. రెండు మనసులను కలిపింది. ఒకరినొకరు అర్థం చేసుకున్నారు.. కొందరు పెద్దలను ఒప్పించారు.. కొందరు ఎదిరించారు... వివాహం చేసుకొని జీవితాలను ఆనందమయంగా మార్చుకున్నారు.. 'మనసున మనసై.. బ్రతుకున బ్రతుకై.. తోడొకరుండిన అదే భాగ్యము.. అదే స్వర్గము' అన్నట్లుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కులాంతర, మతాంతర వివాహం చేసుకొని ఆదర్శవంతంగా జీవితం గడుపుతున్న కొందరిని శుక్రవారం వాలెంటైన్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. వివరాలను, వారి మనోభిప్రాయాలను తెలుసుకున్నది. ఆ వివరాలు మీ కోసం...

- జడ్చర్ల/ కొత్తకోట/ మహబూబ్‌నగర్ టౌన్/ నారాయణపేట/ గద్వాల సర్కిల్/ నాగర్‌కర్నూల్ టౌన్ (ఆంధ్రజ్యోతి)

అన్నీ తానై అండగా ఉండడమే..



కోట్ల చంద్రశేఖర్‌రెడ్డి, కవిత

తల్లిదండ్రులను కాదని వస్తున్న యువతికి అన్నీ తానై అండగా ఉన్నప్పుడే ప్రేమ పెళ్లికి అర్థం ఉంటుంది. మా ప్రేమ విషయం రెండు కుటుంబాల పెద్దలకు చెప్పి వివాహానికి ఒప్పించాం. మాకు ఇద్దరు పిల్లలు, వారు ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నారు. మంచిగా వ్యాపారం చేసుకుంటూ ఆనందంగా జీవితం గడుపుతున్నాం. ప్రేమించడం గొప్ప కాదు.. పెద్దలను ఒప్పించి వివాహం చేసుకోని రెండు కుటుంబాల బంధువులను సంతోష పెట్టడమే ముఖ్యం. పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే ఇద్దరూ లేదా ఒక్కరు ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగం సంపాదించుకోవాలి. అప్పుడు పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేయాలి. అయినా వారు అంగీకరించకపోతే బాగా ఆలోచించుకొని పెళ్లి చేసుకోవాలి.

- కోట్ల చంద్రశేఖర్‌రెడ్డి, కవిత దంపతులు, కొత్తకోట

ఇష్టపడ్డాం.. పెళ్లి చేసుకున్నాం

- మల్లేశ్, మంజుల దంపతులు, నారాయణపేట



మల్లేశ్, మంజుల

ఇష్టపడ్డాం.. ప్రేమ పెళ్లి చేసుకున్నాం.. ఒకరినొకరు అర్థం చేసుకున్నాం. కష్టపడి పనిచేసుకొని జీవితంలో స్థిరపడ్డాం అంటున్నారు నారాయణపేటకు చెందిన మల్లేశ్, మంజుల దంపతులు. మల్లేశ్ ఐటీఐ పూర్తి చేసుకొని ఉపాధి కోసం బెంగళూరులో చిరుద్యోగం చేస్తుండగా, శ్రీరంగపట్నం నగరానికి చెందిన మంజుల కూడా అక్కడో ఉద్యోగం చేస్తోంది. వారిద్దరి పరిచయం ప్రేమగా మారింది. కానీ వారి వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో 1997, జూన్ ఆరున ధర్మస్థల్‌లోని మంజునాథ దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. రెండేళ్లకు వారికి కుమార్తె జన్మించింది. ఆ తర్వాత ఇరు కుటుంబాల పెద్దలు వారికి దగ్గర కావడంతో పదిహేనేళ్ల క్రితం నారాయణపేటకు వచ్చారు. కుమార్తెకు వివాహం వివాహం జరిపించి, మనవడితో ఆడుకుంటూ సంతోషంగా జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రేమ అనిర్వచనీయం.. శక్తివంతం

- ప్రణీత, మహేశ్ దంపతులు, గద్వాల



కుమారులతో ప్రణీత, మహేశ్

ప్రేమ అనిర్వచనీయం.. శక్తివంతం.. పవిత్రం.. అంటున్నారు గద్వాలకు చెందిన ప్రణీత, మహేశ్ దంపతులు. అప్పట్లో సాధారణ ఫొటోగ్రాఫర్ అయిన మహేశ్, ప్రేమించుకున్నారు. వారి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో వారిని ఎదిరించి 1995, డిసెంబర్ 18న పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు, బంధువులు ఆదరించకపోవడంతో చాలా బాధ పడ్డారు. అయినా ధైర్యంగా ముందుకు సాగారు. ప్రణీత ఓ ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తూనే హిందీ పండిట్ కోర్స్ పూర్తి చేశారు. ప్రస్తుతం కేజీబీవీలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. మొదట్లో ఫొటో స్టూడియో నిర్వహించిన మహేశ్, ప్రస్తుతం ఓ వైపు రెస్టారెంట్‌ను నిర్వహిస్తూ, డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నారు. ఆర్థికంగా స్థిరపడి పిల్లలను ఉన్నతంగా చదివించారు. ఈ 29 ఏళ్ల వైవాహిక జీవితంలో ఏనాడు చిన్న గొడవకు కూడా జరగలేదని ప్రణీత, మహేశ్ చెప్తున్నారు. మా ఇద్దరి మధ్య ప్రేమ, ఆప్యాయతలను గుర్తించిన ఇరు కుటుంబాల వారు స్వయంగా ఇళ్లకు ఆహ్వానించడం, శుభకార్యాలకు పిలవడం మాలో సంతోషాన్ని నింపిందన్నారు.

పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం

- నయీ మొద్దీన్, జమీలాబేగం, జడ్చర్ల



నయీమొద్దీన్, జమీలాబేగం

ఒకరిని ఒకరు అర్థం చేసుకున్నారు.. అభిప్రాయాలను పంచుకు న్నారు... కలిసి ఉంటే భవిష్యత్తు మరింత అందంగా ఉంటుందని నమ్మారు... పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు... మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణానికి చెందిన నయీ మొద్దీన్, జమీలాబేగం దంపతులు. పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నప్పుడు వారి మధ్య ప్రేమ చిగురించింది. సంవత్సరం పాటు ఒకరినొకరు అర్థం చేసుకొని, కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. తమ ప్రేమ విషయాన్ని పెద్దలకు చెప్పారు. వారు మొదట అభ్యంతరం చెప్పినా, ఇరు కుటుంబాల సభ్యులను ఒప్పించి 1976లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొంత కాలం అదే పాఠశాలలో పని చేసిన వీరు 1980లో రవీంద్ర విద్యానికేతన్ ప్రైవేట్ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఓ వైపు పాఠశాలను నిర్వహిస్తూనే 1982లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యో గం సంపాదించారు. గజిటెడ్ హెడ్‌మాస్టర్‌గా నయీమొద్దీన్, ఎస్‌ఏ సోషల్ టీచర్‌గా జమీలాబేగం పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్న ఇద్దరు కుమారులతో వారి వైవాహిక జీవితం ఎంతో సంతోషంగా కొనసాగిస్తున్నారు.

అంతరాలు వేరు.. అంతరంగం ఒక్కటి..

- నాణ్యానాయక్, శ్వేతరెడ్డి, మహబూబ్‌నగర్



నాణ్యానాయక్, శ్వేతరెడ్డి

షాద్‌నగర్ మండలం వెంకన్న గూడెంకు చెందిన నాణ్యానాయక్, దేవరకద్ర మండలం, బస్వాయిపల్లికి చెందిన శ్వేతారెడ్డిలకు ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు అయిన పరిచయం ప్రేమగా మారింది. ఆ తర్వాత ఉన్నత విద్యాభ్యాసం చేసిన నాణ్యానాయక్‌కు ఉమ్మడి జిల్లాలోని కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో కుటుంబ సభ్యులు తమ కులం యువతినే పెళ్లి చేసుకోవాలని పట్టుపట్టారు. అయినా నాణ్యానాయక్ తాను ప్రేమించిన యువతినే పెళ్లి చేసుకుంటానని స్పష్టం చేశారు. ఇరువైపుల పెద్దలు వారి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో వారిద్దరూ 2009, డిసెంబర్ రెండున అప్పటి కలెక్టరేట్ సహోద్యోగుల సాక్షిగా హైదరాబాద్‌లోని ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకున్నారు. ఇప్పటికి 16 సంవత్సరాలు గడిచినా తమ మధ్య ఎలాంటి సమస్యలూ రాలేదని వారు చెప్తున్నారు. ప్రస్తుతం నాణ్యానాయక్ కలెక్టరెట్‌లోని ఎఫ్ సెక్షన్‌లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి రోహిత్ 8వ తరగతి, రోహణ్ 7వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆనాడు పెళ్లిని వ్యతిరేకించిన పెద్దలు వారిని చూసి ఇప్పుడు మురిసిపోతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం కాదనుకొని..

- కురువ శ్రీను, రాధిక గౌడ్, బండమీదిపల్లి



కుర్వ శ్రీను, రాధిక గౌడ్

తన తమ్ముడి కుమార్తెను వివాహం చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగం చేస్తు, చనిపోయిన మీ తండ్రి ఉద్యోగం నీకు ఇప్పిస్తానని తన తల్లి ఎంత చెప్పినా అతడు వినలేదు. తాను ప్రేమించిన యువతిని 2011, నవంబరు 21న పెళ్లి చేసుకొని అష్టకష్టాలు పడ్డారు. తనకు రావాల్సిన ప్రభుత్వ ఉద్యోగాన్ని, తన సోదరుడికి ఇచ్చినా, అతడు తాను ప్రేమించిన యువతిని మాత్రం వదులుకోలేదు. ఆ తర్వాత హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన బండమీదిపల్లికి చేరుకొని పాలకేంద్రాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. బండమీదిపల్లికి చెందిన కుర్వ శ్రీను, ఆదే గ్రామానికి చెందిన యువతి రాధిక ప్రేమించుకున్నారు. కానీ వారి తల్లిదండ్రులు వేరే సంబంధాలు చూశారు. ఆమె పెళ్లి మరో వారంలో ఉందనగా, ఇంటి నుంచి కట్టుబట్టలతో బయటకు వచ్చేశారు. స్నేహితుల సహాయంతో వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇప్పటికి పెళ్లి అయి 14 సంవత్సరాలు కావస్తున్నా వారి మధ్య ఎలాంటి విబేధాలు రాలేదు. ఊర్లో వ్యాపారం ప్రారంభించిన కొత్తలో కొంచెం కోపంగా ఉన్న కుటుంబసభ్యులు, ఆ తర్వాత వారిని అక్కున చేర్చుకున్నారు.

పట్టుబట్టి.. కానిస్టేబుల్ జాబ్ కొట్టి..

- ప్రకాశ్, రాధిక, నారాయణపేట



కుమార్తెతో ప్రకాశ్, రాధిక

వారిద్దరూ క్లాస్‌మెట్లు. పరిచయం ప్రేమగా మారింది. అయినా తొందరపడలేదు. ఇద్దరూ పట్టుబట్టి కానిస్టేబుల్ జాబ్ సాధించి పెళ్లి చేసుకొని ఆదర్శ జీవితం గడుపుతున్నారు. నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండలం, నిడుగుర్తికి చెందిన ప్రకాశ్, మహబూబ్‌నగర్‌కు చెందిన రాధిక క్లాస్‌మెట్లు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పట్టుదలతో చదివి కానిస్టేబుల్ ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించి 2021, మే 26న పెళ్లి చేసుకున్నారు. రాధిక జిల్లాకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో, ప్రకాశ్ మక్తల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది.

నాలుగు దశాబ్దాల ఆదర్శ జీవితం

- వంకేశ్వరం నిరంజన్, అరుణరెడ్డి, నాగర్‌కర్నూల్



వంకేశ్వరం నిరంజన్, అరుణరెడ్డి

తాము ప్రేమ వివాహం చేసుకొని నాలుగు దశాబ్దాలుగా ఆదర్శ జీవితం గడుపుతున్న దంపతులు, తమ కుమారులకు కూడా వారి ఇష్ట ప్రకారం ప్రేమ వివాహం జరిపించారు. కులాంతర వివాహం చేసుకున్న వారు నాగర్‌కర్నూల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివసిస్తున్నారు. వంకేశ్వరం నిరంజన్, అరుణారెడ్డి దంపతులు కాలేజీ రోజుల్లో ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో 1982లో కాలాంతర వివాహం చేసుకున్నారు. వంకేశ్వరం నిరంజన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. ఆయన భార్య అరుణ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. వారు తమ ముగ్గురు కుమారులను బాగా చదివించి, ప్రయోజకులను చేసి వివాహం చేశారు. వారిలో ఇద్దరు కుమారులది కూడా కులాంతర ప్రేమ వివాహమే కావడం విశేషం..

యువతీ యువకులు తొందర పడొద్దు



భర్త కృష్ణ, పిల్లలతో జరీనాబేగం

యువతీ యువకులు తొందరపడొద్దు. తొందరపడటం వల్లే చాలా వరకు ప్రేమ పెళ్లిళ్లు నిలవడం లేదు. ఆ దంపతులు సంతోషంగా జీవించడం లేదు. అందరు యువతీ యువకుల్లాగా మేమూ ఆలోచించి ఉంటే ఇంత స్థాయిలో ఉండేవాళ్లము కాదు. మాది మతాంతర వివాహం. నా భర్త కృష్ణ హిందువు. నేను ముస్లిం. మేము బాగా చదువుకొని మా కాళ్లపై మేము బతకగలం అనే నమ్మకం వచ్చిన తర్వాతే పెళ్లి చేసుకున్నాం. ఉద్యోగాలు సంపాదించుకున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమార్తె డాక్టర్, కొడుకు డిగ్రీ చదువుతున్నాడు. మా ఇద్దరి కుటుంబాలు కూడా మాతో అన్యోన్యంగా ఉంటున్నాయి. మా వివాహం జరిగి 25 సంవత్సరాలు అవుతుంది. ఇప్పటివరకు మా మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలూ రాలేదు. ఇద్దరు పిల్లలతో కలిసి మా జీవితాలను సంతోషంగా కొనసాగిస్తున్నాం.

- జరినాబేగం, జిల్లా స్త్రీ, శిశు, వికలాంగులు సంక్షేమాధికారి

స్వచ్ఛమైన ప్రేమకే విలువ

» ముందు కెరియర్, తరువాతే ప్రేమ - పెళ్లి

వనపర్తి అర్బన్/ పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన ప్రేమకే విలువ అంటున్నారు వనపర్తి ఇంజనీరింగ్ కళాశాల, పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు. ముందు కెరియర్, ఆ తర్వాత ప్రేమ, పెళ్లి అని అభిప్రాయపడ్డారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు



ప్రేమ పెళ్లిళ్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు. ప్రేమ పెళ్లిళ్ల తప్పు అనడం లేదు. ప్రేమిస్తే ముందుగా అతడి నేపథ్యం ఏమిటి? భవిష్యత్తులో సరిగా చూసుకుంటాడా? ఆర్థికంగా స్థిరపడగలమా? తదితర విషయాలన్నీ తెలుసుకొని పెళ్లి చేసుకోవాలి. ఏది ఏమైనా పెద్ద అంగీకారం లేకుండా పెళ్లి చేసుకుంటే, ఆ తర్వాత వారి మద్దతు లభించదు.

- కళ్యాణి, బీటెక్ ఫైనల్ ఇయర్

పెద్దలను ఒప్పించాలి



ప్రేమించడం తప్పు కాదు. అలా అని కరెక్ట్ కాదు. మనస్ఫూర్తిగా ప్రేమిస్తే పెద్దల సమక్షంలో నచ్చజెప్పి పెళ్లి చేసుకోవాలి. అప్పుడే భవిష్యత్తులో ప్రేమ పెళ్లిళ్ల నిలబడతాయి. ప్రేమికులు ఇద్దరు ఉన్నత స్థానంలో ఉంటే తప్ప ప్రేమ పెళ్లి ఎక్కువ రోజులు నిలబడదు. సినిమాల ప్రభావంతో చాలా మంది ప్రేమలో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

- వెంకట్, బీటెక్ థర్డ్ ఇయర్

పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలి



ప్రేమ పెళ్లిళ్ల కాకుండా పెద్దలు కుదిర్చిన సంబంధాలు చేసుకుంటే బాగుంటది. మన మీద ఎన్నో ఆశలు పెట్టుకుని చదివిస్తుంటారు. ప్రేమలో పడి వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయవద్దు. ప్రేమించడం తప్పు కాదు కానీ పెళ్లి అయ్యాక ఎదురయ్యే సమస్యలను తట్టుకోలేక చాలా మంది విడిపోతున్నారు. అందుకే తల్లిదండ్రులు కుదిరించిన పెళ్లిళ్ల చేసుకుంటే బాగుంటది.

- హర్షిత, బీటెక్ ఫైనల్ ఇయర్

జీవితంలో స్థిరపడిన తర్వాతే ప్రేమ, పెళ్లి



ఈ రోజుల్లో ఎక్కువగా ప్రేమ పెళ్లిళ్ల, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటున్నారు. వారిలో కొందరు మాత్రమే జీవితాంతం కలిసి ఉంటున్నారు. ప్రేమ పెళ్లి చేసుకుంటే, ప్రధానంగా ఆర్థిక ఇబ్బందులను ఎదురుకోవాల్సి వస్తుంది. దీంతో పాటు ఇరు కుటుంబాలు దూరం అవుతాయి. జీవితంలో స్థిరపడిన తరువాతే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచించాలి. అప్పుడే జీవితం ఆనందంగా కొనసాగుతుంది.

- హన్మంతు, పీయూ విద్యార్థి

అర్థం చేసుకొనే భాగస్వామి కావాలి



తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా, ప్రేమ వివాహం చేసుకున్నా.. జీవిత భాగస్వామిని అర్థం చేసుకుంటే చాలు. అప్పుడే జీవితమంతా సంతోషంగా కొనసాగుతుంది. యువతీ యువకులు ఎక్కువ మంది ప్రేమలో పడుతున్నప్పటికీ మధ్యలోనే విడిపోతున్నారు. అందుకు ప్రధాన కారణం భయం కాగా, కొందరు మాత్రమే ధైర్యం చేసి పెళ్లి చేసుకుంటున్నారు. నేను మాత్రం పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటాను. ఒక వేళ ప్రేమిస్తే ఇరు కుటుంబాలను ఒప్పించేందుకు ప్రయత్నిస్తాను.

- పరమేశ్, పీయూ విద్యార్థి

ఆకర్షణకు లోనైతే జీవితం ఆగం

» యువతపై సోషల్ మీడియా, సినిమాల ప్రభావం » ప్రేమ పేరుతో భవిష్యత్తు నాశనం

» టెన్త్, ఇంటర్ చదువుతున్న వారే అధికం » భవిష్యత్తుపై ఆలోచన అవసరం

నాగర్‌కర్నూల్/ గద్వాల క్రైం/ నారాయణపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : శ్రద్ధగా చదువుకోవాల్సిన వయసులో కొందరు వక్రమార్గం పడుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రేమలో పడుతున్న మైనర్లు, తల్లిదండ్రుల నుంచి మిస్సింగ్ కేసులు ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించినా, చేసిన తప్పులను సరిదిద్దుకోలేక, చదువుపై దృష్టి సారించలేక జీవితాలను పాడు చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు ప్రేమను ఒప్పుకోలేదనే కారణంతో మైనర్లు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవలి కాలంలో మూడు జరిగాయి. తాడూరు, పెద్దకొత్తపల్లి, బిజినేపల్లి మండలాల్లో ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

అధికమవుతున్న మిస్సింగ్ కేసులు

జిల్లాలో మైనర్ల మిస్సింగ్ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయి. వీటిలో టెన్త్, ఇంటర్మీడియట్ బాల, బాలికలో అధికంగా ఉంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఉప్పునుంతల మండలంలో రెండు మిస్సింగ్ కేసులు నమోదు కాగా, అందులో ఒక మైనర్ ఉంది. పదరలో మూడు, వెల్దండలో ఒకటి మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. గతేడాది నమోదైన 26 మిస్సింగ్ కేసుల్లో పోలీసులు, షీటీమ్ సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించి మైనర్లను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాది ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యం అయిన ఘటనలో ఇద్దరు యువకులతో పాటు మరికొందరిపై కేసు నమోదయ్యింది. ఇటీవలే గద్వాల పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక కన్పించకుండా పోవడంతో, ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదయ్యింది. మిస్సింగ్ కేసుల్లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే, పోలీసులు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేస్తున్నారు. చట్టప్రకారం అనివార్యంగా ఈ పని చేయాల్సి వస్తుంది. దీంతో ఉజ్వలమైన భవిష్యత్తును కోల్పోయే పరిస్థితి దాపురించింది. మైనర్లుగా ఉన్నప్పుడే ప్రేమలో పడి, వ్యవహారం పోలీస్‌స్టేషన్లలో కేసుల వరకు వెళ్లడంతో మైనార్టీ తీరాక కూడా ఆడ పిల్లలకు సంబంధాలు కుదరక తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న పోక్సో కేసులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పోక్సో కేసులు అధిక సంఖ్యలో నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. చదువుకోవాల్సిన వయసులో మైనర్‌లు ప్రేమలో పడుతున్నారు. వ్యామోహంతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. ఒకరినొకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నా, వెళ్లిపోయినా మేజర్ కాకుండా మైనర్ అయితే పోక్సో కేసు నమోదవుతుంది. అమ్మాయికి ఇష్టమున్నా.. ఆమె మేజర్ కాకపోతే పోక్సో కేసు పెడతారు. మేజర్ అయిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. 2024లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 342 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఈ కేసు నమోదైతే నెల నుంచి మూడు నెలల వరకు బెయిల్ వచ్చే పరిస్థితి ఉండదు. వీటితో పాటు వందల సంఖ్యలో అమ్మాయిల మిస్సింగ్ కేసులు నమోదవుతున్నాయి. ఇందులో చాలాకేసుల్లో ప్రేమ పేరుతో వెళ్లిపోతున్నారు.

కోర్టు మెట్లు ఎక్కుతున్న దంపతులు



చాలా మంది యువతీ యువకులు ప్రేమించాలనుకుంటారు. కొందరు ప్రేమలో మునిగిపోతారు కొందరు తప్పించుకుంటారు. సరిగ్గా స్థిరపడే వయ స్సులో, చదువే లక్ష్యమని ఆలోచించే వయసులో ఈ ప్రేమ ఇద్దరి జీవితాలను ఇబ్బంది పెడుతుంది. లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నారు. తీరా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాక కలహాలతో విడిపోతున్నారు. పెద్దల మద్దతు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. చివరికి కొట్లాటలు, హత్యలు, కోర్టు కేసులతో జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. యువతీ యువకులు జీవితంలో స్థిరపడిన తర్వాతే ప్రేమ వివాహం గురించి ఆలోచించాలి.

- జంగం విశ్వనాథ్, సైకాలజీ అధ్యాపకుడు, పీయూ

ముందు జీవితంలో స్థిరపడాలి



ప్రేమించడం తప్పుకాదు. అయితే ముందుగా జీవితంలో స్థిరపడాలి. చదువుకునే రోజుల్లో ప్రేమ పేరుతో విలువైన సమయాన్ని వృథా చేయొద్దు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకం మేరకు ఉన్నత చదువులు చదివి, జీవితంలో స్థిరపడాలి. తరువాత ప్రేమ, పెళ్లిపై దృష్టి సారించాలి. లేకపోతే భవిష్యత్తు అంధకారంగా మారుతుంది. వృత్తి పరంగా మేము ఎన్నో కేసులను చూస్తుంటాము. కొందరు గుడ్డిగా ప్రేమలో పడి, మోసపోయి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాలలో ఎవరో తెలియని వారిని ప్రేమించి మోసపోతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను గమనిస్తుండాలి. పిల్లలతో ప్రేమపూర్వకంగా ఉంటూ వారితో అభిప్రాయాలను పంచుకోవాలి.

- ఎస్పీ జానకి, మహబూబ్‌నగర్


జీవితాలను నాశనం చేసుకోవద్దు



ప్రేమకు ఆకర్షితులై చిన్న వయసులోనే జీవితాలను నాశనం చేసుకోవద్దు. ముందు జీవితంలో స్థిరపడటంపై ఆలోచించాలి. ఆ తరువాతే జీవిత భాగస్వామి గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఒకరి మనసులు ఒకరు గెలుచుకుని, ఒకరినొకరు అర్థం చేసుకుని సమస్యలను అధిగమించడమే నిజమైన ప్రేమ.

- రావుల గిరిధర్, ఎస్పీ, వనపర్తి

పిల్లల నడవడికను గమనించాలి



సోషల్ మీడియా, సినిమాల ప్రభావంతో టీనేజర్లు భవిష్యత్తును ఆలోచించకుండా వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేస్తున్నారు. పిల్లలు టీనేజీకి వచ్చినప్పటి నుంచి వారి నడవడికను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.

- కనకయ్య, నాగర్‌కర్నూల్, సీఐ

ప్రేమ అంటేనే అకర్షణ



ప్రేమ అంటేనే అకర్షణ. తల్లిదండ్రులు ఎక్కువగా పోట్లాడుకోవడం, పట్టించుకోకపోవడంతో పిల్లలు ఇతరల ఆకర్షణకు లోనయ్యే అవకాశం ఉంటుంది. దాన్నే ప్రేమగా భావించి పెళ్లి చేసుకోవడంతో కొద్ది రోజులకే మనస్పర్థలు వస్తున్నాయి. యువతీ యువకులు తమ కాళ్లపై నిలబడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలి.

- డాక్టర్ హేమలత, మానసిక వైద్యురాలు, గద్వాల

రుద్రారం.. ప్రేమారం

» ప్రేమ పెళ్లి చేసుకున్న వారికి గ్రామస్థుల సహకారం

» ఆ ఊరిలో 50 ప్రేమ వివాహాలు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆ గ్రామంలో ప్రేమకు చాలా విలువ ఇస్తున్నారు. ప్రేమించుకున్న యువతీ యువకులకు కుటుంబసభ్యులు, గ్రామస్థులు అండగా నిలిచి వివాహం జరిపిస్తున్నారు. అదే మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామం. 15 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన రాఘవేందర్, అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అలాగే దళితుడైన రవి అనే యువకుడు కూడా కులాంతర వివాహం చేసుకున్నాడు. మొదట వారికి ఇబ్బందులు ఎదురైనా, ఆ తర్వాత కుటుంబసభ్యులు వారిని ఆదరించారు.

దాదాపు 450 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో ఇప్పటివరకు 50 ప్రేమ వివా హాలు జరిగాయి. ప్రస్తుతం ఎవరైనా ప్రేమించి పెళ్లి చేసుకుంటే వారికి గ్రామస్థులు అండగా నిలుస్తున్నారు. జీవితం సజావుగా సాగే లా అవగాహన కల్పిస్తున్నారు. అలాగే మండలంలోని కొండాపూర్, యన్మనగండ్ల, కాకర్లపాడ్ తదితర గ్రామాల్లోనూ ఇటీవలి కాలంలో ప్రేమ వివాహాలు అధికంగా జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. అవసరమైన సమయాల్లో పోలీసులు కూడా ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి కొత్త జంటలను ఒకటి చేస్తున్నారు.



కులాంతర వివాహం చేసుకున్న రవి దంపతులు, వారి పిల్లలు

న్యూస్ బాక్స్

పెంట్లవెల్లి తహసీల్దార్‌గా విజయసింహ



పెంట్లవెల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దార్‌గా గురువారం విజయసింహ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న జయంతి అచ్చంపేట ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసింహ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

18న రైతు దీక్షకు హాజరుకానున్న కేటీఆర్

కల్వకుర్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్ పట్టణంలో ఈనెల 18న నిర్వహించనున్న రైతు దీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్ తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఐతోల్ సబ్ స్టేషన్ పరిధిలోని ఐతోల్, పాపగల్, సిర్సవాడ, గోవిందాయపల్లి, ఎట్టిధార్‌పల్లి, భలాన్‌పల్లి, లచ్చిరాంతండా గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా ఉండదని మండల విద్యుత్ అధికారి శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లోని రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

'పరిహారం పెంచే వరకు రిలే నిరాహార దీక్షలు'

చారకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో 29 ఇళ్లు కోల్పోవడంతో రోడ్డున పడ్డామని, పరిహారం పెంచి, ఇళ్లు కట్టించే వరకు రిలే నిరాహారదీక్షలు చేపడుతామని నిర్వాసితులు అన్నారు. మండల కేంద్రంలోని చెర్కుపల్లి చౌరస్తాలో నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షలు చేపట్టిన నిర్వాసితులకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండపల్లి బాలస్వామి సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితులు పాల్గొన్నారు.

'అభ్యంతరాలుంటే తెలపాలి'

వంగూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలో పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంపీవో వెంకటేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలుంటే చెబితే ఈనెల 14న పరిష్కరించి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను విడుదల చేస్తామని ఎంపీవో వెంకటేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, నాయకులు యాదగిరిరావు, నిరంజన్, సైదులు పాల్గొన్నారు.

స్వీయ పరిశుభ్రత పాటించాలి

ఊర్కొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు స్వీయ పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ రామ్‌కోటి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పౌష్టికాహారం, ఆరోగ్యంపై గ్రామ మహిళా సంఘం అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆటల ద్వారా ఆరోగ్యం, పౌష్టికాహారంతో రోగాలు దరి చేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంతోష్, సీసీ సునీల్ కుమార్, ప్రభాకర్, ఏఎస్ఎం వరలక్ష్మీ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుమిత్రమ్మ తదితరులు ఉన్నారు.

డ్రాప్ అవుట్స్ పిల్లలను పాఠశాలకు పంపించండి

లింగాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : డ్రాప్ అవుట్ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోనేరు సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్‌లు అన్నారు. అంబటిపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ అయి మధ్యలో పాఠశాల మానేయడం, వారి సొంత పనుల్లో ఉండడంతో పాటు తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నారని అన్నారు. పిల్లలందరినీ పాఠశాలకు పంపించి వారి బంగారు భవిష్యత్తు ఆలోచించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతీ చిన్నారికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాపట్ల మాజీ ఉప సర్పంచ్ పబ్బతి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'మాదిగ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘంగా సాగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల కుటుంబాలను, మాదిగ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మాదిగ జేఏసీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వంగూరి జయశంకర్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగ అమరవీరుల కుటుంబా లకు, ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, 250 గజాల స్థలం ఇతర సంక్షేమ పథకాలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలకు పైన జరిగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సీఎం ముగింపు పలికారన్నారు. మాదిగలంతా సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన వెంట ఉంటారన్నారు. మాదిగల రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచాలనే కోరారు.

యువతకు ఆటాపాట అవసరం

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



కబడ్డీ పోటీల్లో రూ.50వేల చెక్కును అందుకున్న గుంటూరు జిల్లా జట్టుతో మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యువత పెడదోవ పట్టకుండా విద్యతో పాటు ఆరోగ్యం, ఆట, పాట అవసరమని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో శ్రీభూనిల సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్రాష్ట్ర కబడ్డీ, మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీల విజేతలకు బుధవారం అర్ధరాత్రి మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి ప్రకాశ్ మిషన్-గుంటూరు జట్టుకు రూ.50వేలు, రెండవ బహుమతి రూ.40వేలు కాసాని అకాడమీ-హైదరాబాద్, తృతీయ బహుమతి రూ.30వేలు పెబ్బేరు మండలం కంచిరావుపల్లి జట్టు, నాల్గవ బహుమతి రూ.20వేలు అలాగే మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీల జట్ల విజేతలకు మంత్రి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఆటలే కాదు చదువులోనూ జీవితంలోనూ ఓటమి చెందామని నిరాశ నిస్పృహలకు గురి కావద్దని, ఓటమి విజయానికి నాందీ కావాలన్నారు. దేవాలయం అభివృద్ధి కోసం రూ.కోటి మంజూరు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. క్రీడలను నిర్వాహణ దాత మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఎంపీటీసీ ప్రతాప్ రెడ్డిలను శాలువా కప్పి మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, గుమ్మకొండ రమేష్, మాజీ ఎంపీపీ వేంకటేశ్వర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ విష్ణు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వైఎస్ చైర్మన్ మెరుగు రాజు, మాజీ చైర్మన్లు బాలస్వామి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేద రైతులు నష్టపోకుండా చూడాలి

- భూ నిర్వాసితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



తాడూరులో పురుగుల మందు తాగి మృతి చెందిన చిన్నయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి - నంద్యాల 167కె జాతీయ రహదారిలో భాగంగా మండల కేంద్రమైన తాడూరు వద్ద బైపాస్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులు ఇద్దరు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గురువారం తాడూరులో సంబంధిత కురుమూర్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద రైతులు నష్టపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇదిలా ఉంటే చిన్నయ్య అనే రైతు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో ఆకుటుంబాన్ని సైతం మర్రి పరామర్శించారు. అక్కడి నుంచి చెర్లటి క్యాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు జానకిరాములు వివాహాది శుభకార్యానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి అక్కడి నుంచి పాపగల్ గ్రామంలో ఇటీవల కాలంలో మృతి చెందిన వ్యక్తికి రూ. 2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ సమద్‌పాషా, అనిల్‌రెడ్డి, పర్వతాలు, ఎం డి.జలీల్, వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవోలతో నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్‌లతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుత ప్రతీ గ్రామంలో ఇల్లు లేని నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళుల మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను నాణ్యతతో కూడిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు పూర్తి చేసేందుకు కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని ఎంపీడీవోలకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని, గ్రామాలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 20మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రతీ మనిషికి ధ్యానం అవసరం



ధ్యానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ సభ్యుడు

కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ మనిషికి, అందులో విద్యార్థులకు ధ్యానం ఎంతో అవసరమని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ప్రచారకర్త మల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. విద్యార్థి దశలో ధ్యానం చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని అన్నారు. గురువారం యాపట్ల, కొత్తయాపట్ల, చంద్రబండ తండా, మారేడుమానుదిన్నె గ్రామాల్లో విద్యార్థులకు, ప్రజలకు ధ్యాన శిక్షణనిచ్చారు. ధ్యానం వల్ల పొందే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు ప్రవీణ్, రాజేశ్వరి, జ్ఞానేశ్వరి, శైలజ, బాలమ్మ, సవార య్య పాల్గొన్నారు.

● కొల్లాపూర్ : విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడికి గురయ్యే ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు ప్రతీ రోజు క్రమం తప్పకుండా ధ్యానం చేయాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి కోరారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమా శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలోనే కండక్టర్లు, డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది మెకానిక్‌లకు ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, పిరమిడ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పదర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలల క్రితం మండలంలోని మద్దిమడుగు రేంజ్ అడవిలో ఎలుగుబంటి దాడికి గురైన అంజయ్యకు గురువారం నల్గొండ జిల్లా కాశీరాజుపల్లి గ్రామంలోని తన స్వగృహంలో అటవీశాఖ అధికారులు రూ.4లక్షల చెక్కును మద్దిమడుగు రేంజ్ అధికారి మహేందర్ అందజేశారు. అడవితో పాటు అడవి జంతువులను రక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గీత, బీట్ ఆఫీసర్ గణేష్, దేవరకొండ రేంజ్ స్టాఫ్ అధికారులు పాల్గొన్నారు.


ఎల్‌వోసీ అందజేత

ఊర్కొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పేదలకు వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి అన్నారు. గురువారం మండలంలోని ఊర్కొండపేట గ్రామానికి చెందిన చింతల విజయలక్ష్మీకి ఐదు లక్షల ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు కైసర్ కాంగ్రెస్ నాయకులు మనోహర్‌రెడ్డి, వహీద్, రవీందర్‌సాగర్, రాజేష్ ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి తమ రక్త గ్రూపు నిర్ధారణ తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు గోపాల్, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, గ్రామ నాయకులు రవి గౌడ్, కురుమయ్య, రాము, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్ఐ శంషుద్దీన్

చారకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ శంషుద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే ప్రమాదాలు చోటు చేసుకొంటాయని అన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విజయవంతమైన మోటివేషనల్ తరగతులు

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.కృష్ణయ్య

కందనూలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం శ్రీపురం రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలలో ఐఏసీ (ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్)కి సంబంధించిన అవెర్నెస్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటనెన్స్ ఇంజనీర్ కుమారి మహిత హాజరై ఎయిర్ లైన్స్ ఉద్యోగాలకు ఇతర పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీ పరీక్షల కోసం ప్రిపేరయ్యేం దుకు ఉచితంగా మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ వై.కృష్ణయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మ, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పూర్తి చేయాలి

బల్మూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్‌ను పూర్తి చేయాలని ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్పన, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

తిమ్మాజీపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు విత్తనాలు పురుగుల మందుల ఎరువుల అమ్మకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఆవంచలో విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల అమ్మే దుకాణాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సహకార రుణాల చెల్లింపునకు గడువు పొడిగించాలి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాలలో రైతులు తీసుకున్న దీర్ఘకాల రుణాల చెల్లింపు వన్‌టైం సెటిల్మెంట్ అవకాశం ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రుణాల చెల్లింపునకు జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు దీర్ఘకాలిక రుణాలు వన్‌టైం సెటిల్మెంట్ అవకాశం కల్పించారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సహకార రుణాల చెల్లింపు తేదీని నెలాఖరుకు పొడిగించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆయన కోరారు.

ఇసుక తరలింపుపై కేసు నమోదు

తెలకపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గురువారం నడిగడ్డ నుంచి తాళ్లపల్లి వైపుగా ఇసుక ట్రాక్టర్ వెళ్తుండగా పట్టుకుని విచారించగా ట్రాక్టర్ డ్రైవర్ బత్తిని బాలచంద్రు, యజమాని బొక్క శేఖర్‌లను, ట్రాక్టర్‌ను పోలీస్ కానిస్టేబుల్ రేణయ్య పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి లేనందున వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు

తెలకపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థులు ఇద్దరు శ్వాస సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నెల 12న రాత్రి 8:30గంటలకు విద్యార్థులను చికిత్స నిమిత్తం పాఠశాల ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, నర్సు సరస్వతి కలిసి స్థానికంగా ఓ క్లినిక్‌కు తీసుకెళ్లారు. తెలకపల్లికి చెందిన రెడ్డపాకుల శివశంకర్ క్లినిక్ కేంద్రానికి వెళ్లి విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయినట్లు అనడంతో పాఠశాల ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు ఫుడ్ పాయిజన్ కాదని అన్నా వినకుండా అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో పాఠశాలలోకి తెలకపల్లికి చెందిన రెడ్డపాకుల శివశంకర్, ఓ న్యూస్ చానల్‌కు సంబంధించిన శేఖరాచారి న్యూస్ సీఈవోకు తెలుగు స్క్రిప్ట్ ట్విట్టర్ అకౌంట్‌కు సంబంధించిన వంగ వినోద్‌గౌడ్‌లు గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయినట్లు తప్పుడు ప్రచారం సోషల్ మీడియాలో చేశారని ప్రిన్సిపాల్ ఆదోని రశ్మీ ఫిర్యాదు చేశారని ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై పైన పేర్కొన్న వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేష్ తెలిపారు.

అందరి సహకారంతో ఆలయం నిర్మిస్తాం

- అమ్రాబాద్‌లో పోచమ్మ ఆలయానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



అమ్రాబాద్‌లో పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అమ్రాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అమ్రాబాద్‌లో పోచమ్మ దేవత నూతన ఆలయ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో పోచమ్మ ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషదాయకమని అన్నారు. ప్రభుత్వం తరఫున నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోచమ్మ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రాములు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరి నారాయణగౌడ్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిమడుగు పుణ్యక్షేత్రంలో ఎమ్మెల్యే బస

పదర : నల్లమలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తెలంగాణకు తలమాణికంగా తీర్చిదిద్దుతానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆయన బుధవారం రాత్రి మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రంలో బస చేసి గురువారం ఉదయం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మద్దిమడుగు ఆలయంలో స్టేజీ నిర్మాణ పనులకు, మారడుగు, గానుగపెంట తదితర గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలకు భూమి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వంకేశ్వరం గ్రామంలో మడేలయ్యా ఆలయానికి మట్టి రోడ్డును మంజూరు చేశారు. మండల కేంద్రంలో రూ.40లక్షల అభివృద్ధి పనులు చేపట్టారు. కొన్ని ఆలయాలకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏఆర్.యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల ఆనంద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్నాల హరికృష్ణ, మాజీ సర్పంచ్ ప్రేమ్, నాయకులు సత్యనారాయణ, వెంకటయ్య, సైజాదీ, హలరాజు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతితోనే రాష్ట్రం అభివృద్ధి

లింగాల : పల్లెల ప్రగతితోనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. అప్పసలికుంట గ్రామంలో రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశారు. అంబటిపల్లి, ధారారం, కేసీతండా, జిలుగుపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రూ.58కోట్లతో మారుమూల గ్రామాలు, తండాల్లో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ రాథోడ్ ఉన్నారు.

ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

- సామాజిక తనిఖీలో ఏడీఆర్‌డీవో రాజేశ్వరి

చారకొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం నిధులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని అడిషనల్ డీఆర్డీవో రాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని మర్రిపల్లిలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఆర్డీవో హాజరై మాట్లాడారు. మండలంలో 1/4/2023 నుంచి 31/3/2024 వరకు ఎన్ఆర్ఈజీఎస్ పనులకు రూ. 2,5,90 కోట్లు నిధులకు గాను మండలంలో 17 గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించామని అన్నారు. మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో రూ. 57,666 దుర్వినియోగం అయినట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసి స్టెంట్లకు రూ. 28 వేలు ఫెనాల్టీ విధించామని అన్నారు. ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. నిధులను రికవరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, ఎంపీవో వెంకటేష్, ఏపీవో లక్ష్మయ్య, డీవీవో నసీరొద్దీన్, ఏవీవో రాజు, అంబుడ్స్ పర్సన్ జంగయ్య, ఈసీ రవి, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలి

- ఎంఈవో బషీర్‌అహ్మద్
- విద్యార్థి తరగతి గదిలో ఉండగానే తాళం వేసిన ఘటనలో విచారణ



మాట్లాడుతున్న ఎంఈవో బషీర్‌అహ్మద్

లింగాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ తమ విధి నిర్వహణ పట్ల బాధ్యతాయుతంగా మెలగాలని మండల విద్యాశాఖ అధికారి బషీర్‌అహ్మద్ సూచించారు. లింగాల మండల పరిధిలోని శాయిన్‌పేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థి తరగతి గదిలో ఉండగా తాళం వేసిన ఘటనపై గురువారం ఎంఈవో బషీర్‌అహ్మద్ ఉపాధ్యాయులు, గ్రామస్థులతో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం పాఠశాల విడిచిన తర్వాత 1వ తరగతి విద్యార్థి శరత్ ఇంటికి రాకపోవడంతో పది నిమిషాలు వేచి చూసిన శరత్ తండ్రి మల్లేష్ పాఠశాల వద్దకు వెళ్లి పరిశీలిస్తూ కిటికీ దగ్గరికి వెళ్లి తరగతి గదిలో చూడగా బాలుడు నేలపై నిద్రపోతున్నట్లు గుర్తించిన విద్యార్థి తండ్రి గది తాళం పగలగొట్టి శరత్‌ను ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇది వాస్తవంగానే జరిగినట్లు విచారణలో తేలిందన్నారు. సాయంత్రం స్టడీ అవర్స్‌లో విద్యార్థులందరినీ పాఠశాల ఆవరణలో కూర్చోపెట్టి చదివించినట్లు తెలిపారు. ప్రతీ రోజు తరగతి గదిలో విద్యార్థులు లేరని నిర్ధారించుకున్న తర్వాతనే గదులకు తాళాలు వేస్తారని తెలిపారు. విద్యార్థి తరగతి గదిలో ఉన్నట్లు గుర్తించకుండా పొరపాటుగా తరగతి గదికి తాళం వేశారని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఎల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన జరుపుకుంటున్న విద్యార్థులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి మంచి ప్రదర్శన కనబరిచారు. ప్రధానోపాధ్యాయులు రాజవర్ధన్‌రెడ్డి ఉపాధ్యాయులైన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా అనూష, మండల విద్యాధికారిగా రాము, జిల్లా విద్యాధికారిగా శ్రీవర్షలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులుగా చక్కగా రాణించిన విద్యార్థి ఉపాధ్యాయులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానోపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మునీశ్వర్, శ్రీకాంత్, శ్రీధర్, డాక్టర్ శ్రీను, కృష్ణకుమారి, రాము, చక్రధర్ రెడ్డి, వెంకటస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాదకరంగా గుంతలు



గుంతల మయంగా ఉన్న వెంకటాపూర్ నుంచి ఉమ్మాపూర్ రహదారి

వంగూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని వెంకటాపూర్ నుంచి ఉమ్మాపూర్‌కు వెళ్లే మట్టి రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతిని గుంతల మయంగా మారింది. రోడ్డుపై అడుగుకో గుంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 3కిలోమీటర్ల వరకు ఉన్న ఈ మట్టి రోడ్డు దారి పొడవునా గుంతలు ఎక్కువగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు వీలు కాని పరిస్థితి ఎదురైంది. కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వంగూరు నుంచి వచ్చే ఉమ్మాపూర్, నిజంబాద, గాజర గ్రామాలకు వాహనాలపై వెళ్లే వారు దూరం తక్కువని ఈ రోడ్డు నుంచే వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారింది. మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి బీటీ రోడ్డు చేపట్టాలి.

- సాయిలు, ఉప్పల్‌పహాడ్